విలేఖరులు
కావలెను
రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు
బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ
స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా
రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాదాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394
సంప్రదించగలరు ఎడిటర్
చల్లా శ్రీకాంత్

RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM

గుంటూరు, సంపుటి : 01 సంచిక : 284 | గురువారం 21 నవంబర్ 2024 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 | వెల : రూ.2-00


GUNTUR VOL-01 ISSUE - 284 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 21 THURSDAY NOVEMBER 2024 PAGES : 8 Rs :2-00

## కలుషిత నీరు అనే మాట వినపడకుండా చేస్తాం



అమరావతి: రక్షిత మంచి నీరు.. ప్రతిఒక్కరి హక్కు అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. జలజీవన్ మిషన్‌పై శాసనసభలో పశ్నోత్తరాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.ప్రతి ఇంటికి తాగు నీరందిస్తామని భరోసా ఇచ్చారు. జలజీవన్ మిషన్ అమలులో ఏపీ దేశానికే తలమానికంగా ఉండేలా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. కలుషిత నీరు అనే మాట వినపడకుండా చేస్తామని.. కిడ్నీ సమస్యలు తగ్గిస్తామని చెప్పారు. చాలా ఆర్వో ప్లాంట్లు పాడైపోయాయని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా, వాటిని పునరుద్ధరిస్తామని పవన్ కల్యాణ్ తెలిపారు.

## ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళ్తున్నాం: సీఎం చంద్రబాబు



అమరావతి: గతంలో ఎన్నడూ లేనివిధంగా 2024 ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు. 150 రోజుల్లో తమ ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తనపై ఉందని చెప్పారు.వైకాపా పాలనలో జరిగిన అక్రమాలపై ఎంత తవ్వితే అంత భయంకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు. శాసనసభలో సీఎం మాట్లాడారు. "నాలుగు దశాబ్దాలుగా ప్రజలు నన్ను ఆదరించారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాను. ప్రజల కోసం నిరంతరం అధ్యయనం చేస్తూ నిత్య విద్యార్థిలా నేర్చుకున్నాను. ఎన్నో కష్టాలు చూశా.. అవమానాలు ఎదుర్కొన్నా. 24 క్లైమోర్‌మైన్స్‌తో దాడి చేస్తే వేంకటేశ్వరస్వామి పునర్జన్మ ప్రసాదించి ప్రాణభిక్ష పెట్టారు. ఈ సభలోనే నా కుటుంబసభ్యులను అవనమానపరిచేలా మాట్లాడారు. ఆ సమయంలో తీవ్ర ఆవేదన కలిగింది. వేధింపులకు గురిచేసి చివరికి జైలుకు పంపించారు. నేను ఏ తప్పూ చేయలేదు.. చేయను. అనుక్షణం ప్రజల కోసమే పనిచేస్తా. అలాంటి ఇబ్బందులు పెట్టినప్పుడు ఇంకా మనోధైర్యంతో ముందుకెళ్లాను. చాలా అరుదైన సంఘటనలు నా జీవితంలో చూశాను. 53 రోజులు జైల్లో ఉన్నప్పుడు ప్రపంచదేశాల్లోని తెలుగువారు రోడ్డు పైకి వచ్చి పోరాడారు. ప్రజలు ఇచ్చిన స్థానాన్ని ఎవరు చెరపాలన్నా చెరగదు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాను. ఇది అరుదైన అనుభవం. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారు. అధికారం, సీఎం కుర్చీ, కేంద్ర రాజకీయాలు కూడా కొత్త కాదు. ప్రాంతీయ పార్టీగా తెదేపా కేంద్రంలో ఎన్నోసార్లు కీలకపాత్ర పోషించింది.విధ్వంసమైన వ్యవస్థలు, గాడితప్పిన యంత్రాంగం, గత ప్రభుత్వ అప్పులు, తప్పులు ఈ ప్రభుత్వానికి సవాలుగా మారాయి. ఈ రాష్ట్రాన్ని బాగు చేయగలమనే నమ్మకముందా? అని కొందరు అడిగారు. నేను పారిపోను.. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజల కోసమే పనిచేశా. ఇప్పుడు కూడా అలాంటి సవాల్‌ను స్వీకరించి మళ్లీ ప్రజలను నిలబెడతానని చెప్పాను. అది చేసి తీరతానని ముందుకొచ్చాను. 21 మంది ఎంపీలతో దిల్లీలో మన పరపతి పెరిగింది. ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళ్తున్నాం. రాత్రికి రాత్రే ఏదీ సాధ్యం కాదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు ప్రజలకు తెలియజేయాలి. అంకితభావంతో పనిచేస్తూ రాజీ లేకుండా ముందుకెళ్తాం.

## పాఠశాలల నిర్వహణ సరిగా ఉండాలి

### బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



రాయల్ జర్నలిజం,బాపట్ల ,నవంబర్ 20 :పాఠశాలల నిర్వహణ సరిగా ఉండాలని, విద్యార్థులు చక్కగా చదువుకునే అవకాశాలు కల్పించాలని కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు.చెరుకుపల్లి మండలంలోని చెరుకుపల్లి, గుల్లపల్లి, కావూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, బాపట్ల పట్టణంలో ని మున్సిపల్ ఉన్నత పాఠశాల ను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెరుకుపల్లి మండలంలో చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ప్రధానోపా ధ్యాయులు కె.లక్ష్మీనారాయణను ఆ పాఠశాలకు సంబంధించి టీచింగ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ వివరాలు, పేరెంట్ మీటింగ్ నిర్వహణ, పాఠశాల క్రీడా ప్రాంగణం వివరాలు, ఆ ప్రాంగణం వ్యాసార్థం, పాఠశాల కాంపౌండ్ వాల్ పడిపోవుటకు గల కారణాలు, పునః నిర్మాణానికి తీసుకున్న చర్యలు, టాయిలెట్ల పరిశీలన వాటి నిర్వహణ, మధ్యాహ్న భోజనానికి సంబంధించి వంట గది పరిశీలన, తరగతి గదుల పరిశీలన, విద్యార్థుల సామర్థ్యం పరిశీలించి ప్రధానోపా ధ్యాయులకు పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదుపరి చెరుకుపల్లి మండలం గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పా ంౕ శా ల న ం సందర్శించి ఆ పాఠశాల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది యొక్క వివరాలు, పాఠశాల యొక్క ల్యాబ్ సందర్శన, ల్యాబ్ లోని పరికరాల వివరాలు వాటి యొక్క పనితీరు ల్యాబ్ యొక్క ఉద్దేశం, వినియోగంపై ఉపాధ్యాయులకు సూచన చేశారు. వంటగది, డైనింగ్ హాల్, కంప్యూటర్ రూమ్, తరగతి గదుల పరిశీలన, పరిసరాల పరిశీలన, ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు గదుల పరిశీలించారు.కావూరి ఉన్నత పాఠశాల సందర్శించి టీచింగ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ వివరాలు, ఆయాతరగతులలో విద్యార్థుల సంఖ్య, పాఠశాల పనితీరు, వంటగదిని పరిశీలించారు. టాయిలెట్ల పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రుల సమావేశల నిర్వహణపై పాఠశాల ప్రధానోపాధ్యాయుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.బాపట్ల, పురపాలక సంఘ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థుల యొక్క సంఖ్య, ప్రస్తుత హాజరైన విద్యార్థుల సంఖ్య, ఆటస్థల పరిశీలన, విస్తీర్ణం, క్రొత్తగా నిర్మాణం చేపట్టిన భవన వివరాలపై ఆరా తీశారు. భవనం త్వరగా పూర్తి చేయడానికి



గుత్తేదారుడికి ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.ఆయన వెంట జిల్లా పంచాయతీ అభికారి ప్రభాకర్, ఇన్ ఛార్జ్ జిల్లా విద్యా అధికారి చీరాల ఉప విద్యా అధికారి ఎ. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## 5.8 కోట్ల నకిలీ రేషన్ కార్డుల ఏరివేత: కేంద్రం



న్యూఢిల్లీ : డిజిటైజేషన్ వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థ లో భారీ స్థాయిలో మార్పులు వచ్చాయని, తద్వారా ఆహార భద్రతలో ప్రపంచానికే బెంచ్ మార్కును నెలకొల్పినట్లయ్యిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.ఈ వ్యవస్థ ద్వారా దేశంలో మొత్తంగా 80.6కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతుండగా.. ఆధార్ ధ్రువీకరణ, ఈకేవైసీ వెరిఫికేషన్‌ల ద్వారా 5.8కోట్ల నకిలీ రేషన్ కార్డులు తొలగిపోయాయని పేర్కొంది. కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ ప్రకారం.. ఇప్పటివరకు 20.4కోట్ల రేషన్ కార్డుల డిజిటలీకరణ పూర్తయ్యింది. దేశవ్యాప్తంగా 5.33 లక్షల చౌకధరల దుకాణాలకు ఈపోస్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీటి సాయంతో 99.8శాతం కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయగా, 98.7శాతం లబ్ధిదారుల ధ్రువీకరణ పూర్తయ్యింది. మ రోవైపు ఈ కేవైసీ ప్రక్రియతో ఇప్పటివరకు 64శాతం లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తయ్యింది.ఆహార పదార్థాల సరఫరా విషయం లోనూ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పకడ్బందీగా వ్యవహరి స్తోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సరకు రవాణాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్‌నూ రైల్వేలతో అనుసంధానించామని తెలిపింది. ఇక వన్ నేషన్-వన్ రేషన్ కార్డుపథకంతో లబ్ధిదారులు దేశంలో ఎక్కడైనా సరకులు తీసుకునే అవకాశం కలిగిందని తెలిపింది.

## చంద్రబాబు అరెస్ట్‌పై మహాకుట్ర.. హోంమంత్రికి కోటంరెడ్డి లేఖ



అమరావతి: వైకాపా హయాంలో చంద్రబాబు అక్రమ అరెస్టుకు జరిగిన మహాకుట్రపై సమగ్ర విచారణ జరిపించాలంటూ హోం మంత్రి వంగలపూడి అనితకు తెదేపా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి లేఖ రాశారు.చంద్రబాబుపై గత ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి దుర్మార్గంగా 53 రోజులు జైలులో పెట్టిందని ఆ లేఖలో పేర్కొన్నారు. చంద్రబాబు లాంటి హై ప్రొఫైల్ వ్యక్తిపై అక్రమ కేసులు పెట్టడం ఒక వ్యక్తి మీద జరిగిన దాడి కాదని.. వ్యవస్థ మీద జరిగినట్లుగా భావిస్తున్నట్లు విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ తెలిపిన విషయాన్ని కోటంరెడ్డి ఈసందర్భంగా గుర్తుచేశారు. తన వాంగ్మూలాన్ని ఫ్యాబ్రికేట్ చేశారని.. ఏకకాలంలో ప్రభుత్వ విభాగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ఫైళ్లు మాయమయ్యాయని ఆయన చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. దీనివెనక అప్పటి సీఎంవో పెద్దల మద్దతు ఉంటేనే అది సాధ్యమవుతుందని పీవీ రమేశ్ పేర్కొనడం, ఆ అంశంపై విచారణ జరిపించాలని అప్పటి డీజీపీకి ఆయన లేఖ రాసినట్లు బహిరంగంగా ప్రకటించారని కోటంరెడ్డి తెలియజేశారు. ఆ లేఖపై వెంటనే స్పందించి విచారణ చేపట్టేందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని హోంమంత్రిని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు.

## కడప స్టీల్‌ప్లాంట్ కోసం ఎంపీ అవినాష్ ఏం చేశారు?: షర్మిల



కడప: పదేళ్లు స్థానిక ఎంపీగా ఉన్న అవినాష్‌రెడ్డి .. కడప స్టీల్‌ప్లాంట్ కోసం ఏం చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు.ప్రజలు ఇలాంటి నాయకులను ఎన్నుకునే ముందు ఆలోచించుకోవాలని వ్యాఖ్యానించారు. కడపలో నిర్వహించిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడారు. గత ఐదేళ్లలో స్టీల్‌ప్లాంట్ కోసం జగన్ చేసిందేమీ లేదన్నారు. కేవలం టెంకాయలు కొట్టే ఫ్యాక్టరీగానే గత పాలకులు తయారు చేశారన్నారు. మీడియా ఎదుట షర్మిల టెంకాయలు కొట్టి నిరసన తెలిపారు."కడప స్టీల్‌ప్లాంట్ శంకుస్థాంౕనలకే పరిమితమైంది. చెల్లి పెళ్లి చేయాలి మళ్లీ మళ్లీ అన్నట్లుగా తయారైంది. పేద ప్రజల కోసం, కడప ప్రాంత అభివృద్ధి కోసం వైఎస్సార్ చిత్తశుద్ధితో దీన్ని తీసుకొచ్చారు. 10వేల ఎకరాల్లో రూ.20వేల కోట్ల పెట్టుబడితో 20 మిలియన్ల టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలన్నది ఆయన ఆశయం. దీని ద్వారా 25వేల మందికి ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షం గా ఉద్యోగాలు కల్పించేందుకు అవకా శముంది. వైఎస్సార్ చనిపోయిన తర్వాత వచ్చిన నాయకులందరూ స్టీల్ ప్లాంట్ ఊసే లేకుండా చేశారు. సెయిల్ ద్వారానే ప్లాంట్ నిర్మించాలని విభజన హామీల్లో ఉంది. 2014లో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చి ఉంటే నిర్మాణం జరిగి ఉండేది. ఏపీ పట్ల భాజపాకు చిన్నచూపు ఉంది. ప్రత్యేక హోదాతో పాటు మిగిలిన హామీ లను సైతం ఆ పార్టీ తుంగలో తొక్కింది.

### జగన్ ఆస్కార్ డైలాగులు చెప్పారు

2019లో అధికారంలోకి వచ్చిన జగన్ కూడా స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని విస్మరించారు. మూడేళ్లలో నిర్మాణం చేపట్టి తన చిత్తశుద్ధిని నిరూపించు కుంటానని జగన్ నాడు ఆస్కార్ డైలాగులు చెప్పారు. అధికారం, ప్రాంతాలు, కంపెనీలు మారుతున్నా స్టీల్ ప్లాంట్ నిర్మాణం మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. పదేళ్లు ఎంపీగా ఉన్న వైఎస్ అవినాష్ రెడ్డి కడప స్టీల్ ప్లాంట్ కోసం పార్లమెంటులో ఏం చేశారో సమాధానం చెప్పాలి. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అసెంబ్లీకి వెళ్లని జగన్‌కు ఎమ్మెల్యే పదవి ఎందుకో?ప్రతిపక్ష హోదాకు అవసరమైన ఎమ్మెల్యేలని గెలిపిం చుకోలేని ఆయన.. ప్రతిపక్ష హోదా కావాలని అడగటం సిగ్గుచేటు. కడప ప్రాంత అభివృద్ధికి స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టకపోతే కాంగ్రెస్ పార్టీ ఉద్యమబాట పడుతుంది. అవసరమైతే నిరవధిక నిరాహార దీక్షకూ సిద్ధం" అని షర్మిల అన్నారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# ఎడిటోరియల్

## విషతుల్య రాజధాని

భారత రాజధాని ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ప్రతి శీతకాలంలానే ఈ ఏడాదీ పాత కథ పునరావృత్తం అయింది. ఒకపక్క పెరిగిన చలికి తోడు ధూళి నిండిన పొగ లాంటి గాలి, కాలుష్య ఉద్గారాలు, పొరుగున ఉన్న పంజాబ్ - హర్యానా లాంటి వ్యవసాయాధారిత రాష్ట్రాల్లో అక్రమంగా సాగుతున్న కొయ్యకాళ్ల దహనం.అన్నీ కలిసి అతి తీవ్ర వాయు కాలుష్యంగా పరిణమించాయి.వారంగా అదే పరిస్థితి కొనసాగుతూ ఉండడం, వాయునాణ్యతా సూచిక (ఏక్యూఐ) సోమవారం గరిష్ఠంగా దాదాపు 500 మార్కును చేరడంతో సుప్రీమ్ కోర్ట్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. స్కూల్ పిల్లలకు భౌతికంగా తరగతులు నిర్వహించవద్దని ఆదేశాలు ఇవ్వాల్సి వచ్చింది. చివరకు బాకూలో జరుగుతున్న ఐరాస వాతావరణ సదస్సు సైతం ఈ కాలుష్యాన్ని ఆందోళనకరంగా పరిగణించడం, నిపుణులు దీన్ని ‘ఆరోగ్య అత్యవసర పరిస్థితి’గా ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు తార్కాణం.ఢిల్లీలో సోమవారరా కాలుష్య స్థాయి దీపావళి నాటి రాత్రి కన్నా దాదాపు 40 శాతం ఎక్కువంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఢిల్లీలో సగటు పీఎం 2.5 స్థాయి... భారతీయ ప్రమాణాల కన్నా 14 రెట్లు ఎక్కువ, అదే ఐరాస పర్యావరణ పరిరక్షక సంస్థ (యూఎస్ఈపీఏ) నిర్దేశించిన ప్రమాణాల లెక్కలో అయితే 55 రెట్లు ఎక్కువ నమోదైంది. వాయు నాణ్యత ఇంతలా క్షీణించడం పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులున్న వారికి ప్రమాదంగా పరిణమిస్తోంది.పీఎం 10 స్థాయిని బట్టి అంచనా వేసే ధూళి కాలుష్యమూ హెచ్చింది. ఆగ్రాలో కళ్ళు పొడుచుకున్నా కనిపించని దట్టమైన పొగ. తాజ్‌మహల్ కట్టడం విషవాయు కౌగిలిలో చేరి, దూరం నుంచి చూపరులకు కనిపించడం మానేసి వారమవుతోంది. మాస్కులు లేకుండా వీధుల్లోకి రాలేని పరిస్థితి. వెరసి, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరమనే దుష్కీర్తి ఢిల్లీకి దక్కింది.స్విస్ గ్రూప్ ఐక్యూ ఎయిర్ తేల్చిన ఈ నిష్ఠురసత్యం ఇన్నేళ్ల మన బాధ్యతా రాహిత్యానికీ, పాలకుల నిష్క్రియాపరత్వానికీ నిదర్శనం. ఆ మాటకొస్తే, 2018లో కానీ, గడచిన 2023లో కానీ ఏడాదిలో ఏ ఒక్కరోజూ ఢిల్లీలో స్వచ్ఛమైన గాలి లేదని రికార్డులు చెబుతున్నాయంటే ఏమనాలి?కాలుష్యం దేశవ్యాప్తంగా ఉందనీ, నివారణ బాధ్యత రాష్ట్రానిదే కాదు కేంద్రానిది కూడా అని ఢిల్లీ ‘ఆప్’ సర్కార్ వాదన. కానీ, ఏటేటా శీతకాలంలో రాజధానిలో పెరుగుతూ పోతున్న ఈ కష్టానికి చెక్ పెట్టడంలో పాలకులు ఎందుకు విఫలమయ్యారంటే జవాబు దొరకదు. విమర్శలు వెల్లువెత్తడంతో ఢిల్లీ సర్కార్ కాలుష్య నిరోధానికి యంత్రాల ద్వారా నీటి తుంపర్లు జల్లడం లాంటి చర్యలు చేపడుతోంది.ఇవేవీ చాలక చివరకు ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లలో కృత్రిమ వర్షాలకు అనుమతి ఇవ్వాలని మరోసారి కేంద్రాన్ని అభ్యర్థిస్తోంది. మేఘమథనం జరిపేందుకు ఇప్పటికే పలుమార్లు కేంద్రాన్ని అనుమతి కోరినా, జవాబు లేదన్నది ‘ఆప్’ ఆరోపణ. ఇలాంటి ప్రయోగాల వల్ల ప్రయోజనమెంత అనేది చర్చనీయాంశమే. అయితే, ప్రజలకు తాత్కాలికంగానైనా ఉపశమనం కలిగించే ఇలాంటి ప్రయత్నాలకు కేంద్రం మొదటే మోకాలడ్డడం సరికాదు.వాయు కాలుష్యం ‘అతి తీవ్ర’ స్థాయులకు చేరిన నేపథ్యంలో ‘గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్’ (గ్రాప్) నాలుగోదశ చర్యలను కఠినంగా అమలు చేయాలన్నది సుప్రీమ్ తాజా ఆదేశం. పాఠశాలల్ని మూసివేయడం, ఆఫీసుకు రాకుండా ఇంటి వద్ద నుంచే పనిచేయడం, పరిశ్రమల మూసివేత లాంటి చర్యలన్నీ నాలుగో దశ కిందకు వస్తాయి. ముప్పు ముంచుకొస్తున్నా మూడో దశ, నాలుగో దశ చర్యల్లో అధికారులు ఆలస్యం చేశారంటూ సర్వోన్నత న్యాయస్థానం చీవాట్లు పెట్టింది.తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు షరతులు అమలు చేయాల్సిందేనని కోర్ట్ చెప్పాల్సి వచ్చిందంటే అధికార యంత్రాంగం అలసత్వం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. నిద్ర లేచిన ప్రభుత్వం ఇప్పుడిక ‘గాప్’ నాలుగో దశ కింద వాహనాల రాకపోకలు, భవన నిర్మాణ కార్యకలాపాలపై షరతులు విధించింది. అయితే, దీంతో ఢిల్లీ, పంజాబ్, హర్యానాల్లో దాదాపు 34 లక్షల చిన్న, మధ్యశ్రేణి సంస్థల్లో ఉత్పత్తి దెబ్బతిననుంది. అంటే కాలుష్య పాపం ఆరోగ్యాన్నే కాక ఆర్థికంగానూ కుంగదీస్తుందన్న మాట.ఢిల్లీలో వాహనాల వల్ల అత్యధిక కాలుష్యం సంభవిస్తుంటే, ఎన్‌సీఆర్‌లో పరిశ్రమలు ప్రధాన కాలుష్య కారకాలని ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (తెరి) 2021లోనే తేల్చింది. అనేకచోట్ల ఇప్పటికీ కట్టెల వాడకం కొనసాగుతోంది. ఇక, పొలాల్లో కొయ్య కాళ్ల దహనం తాజా దురవస్థకు 40 శాతం కారణమట. అన్నీ కలిసి పీల్చే గాలే విషమయ్యేసరికి, ఢిల్లీ వాసుల ఆయుఃప్రమాణం సగటున ఏడేళ్ళు తగ్గుతోంది.రాజధాని, ఆ పరిసరాల్లోని 3 కోట్ల పైచిలుకు మంది వ్యథ ఇది. నిజానికి, స్వచ్ఛమైన గాలి ప్రాథమిక మానవహక్కని గత నెలతో సహా గత అయిదేళ్లలో సుప్రీమ్ అనేకసార్లు స్పష్టం చేసింది. వాయునాణ్యతకు చర్యలు చేపట్టాల్సిందిగా కేంద్ర, రాష్ట్రస్థాయి యంత్రాంగాలను ఆదేశించింది. అయినా జరిగింది తక్కువ. సరైన ప్రాణ వాయువు కూడా అందని ఈ పరిస్థితికి ప్రజల నుంచి పాలకుల దాకా అందరూ బాధ్యులే.కాలుష్య నివారణ, నియంత్రణలకు సృజనాత్మక ఆలోచనలు చేయలేకపోవడం ఘోరం. దాహమేసినప్పుడు బావి తవ్వకుండా ఏడాది పొడుగూతా వ్యూహాత్మకంగా చర్యలు చేపట్టడం అవసరం. ఆధునిక సాంకేతికత, ప్రజారవాణా, ప్రజల అలవాట్లలో మార్పులు సహా అనేక అంశాల్లో రాజకీయ కృత నిశ్చయంతో విధాన నిర్ణేతలు పనిచేయాలి. లేదంటే, సాక్షాత్తూ దేశ రాజధానే నివాసయోగ్యం కాక జనం తరలిపోతుండడం చూసి వికసిత భారత్, లక్షల కోట్ల ఆర్థికవ్యవస్థ లాంటివన్నీ వట్టి గాలి మాటలే అనుకోవాల్సి వస్తుంది.

# పూర్తి అయిన గృహాలలో లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించాలి



రాయల్ జర్నలిజంపాలకోడేరు,నవంబర్ 20: బుధవారం పాలకోడేరు మండలం విస్సాకోడేరు ఫోరు నెంబరు పేట హౌసింగు లేవుట్ ను జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ఆకస్మిక తనిఖీలు చేసారు. ప్రతి ఇంటిని పరిశీలించి, నివాసం ఉంటున్న కాలనీ మహిళలతో జిల్లా కలెక్టరు మాట్లాడారు. కాలనీలో వర్షం వస్తే జలమయం అవుతుందని, త్రాగునీరు, డ్రైనేజీ, రహదారులు నిర్మించాలని మహిళలు జిల్లా కలెక్టరును కోరారు. జిల్లా కలెక్టరు స్పందిస్తూ దశలవారీగా మీ సమస్యలను పరిష్కరిస్తామని, ముందు ప్రాధాన్యత క్రమంలో త్రాగునీరు సమస్యను పరిష్కరించి, స్వచ్ఛమైన త్రాగునీరును రెండు పూటల పుష్కలంగా అందిస్తామని తెలిపారు. విస్సాకోడేరు ఫోరు నెంబరు పేట హౌసింగు లేవుట్ లో మొత్తం 96 ప్లాట్లు మంజూరు కాగా, వాటిలో 39 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని, గృహప్రవేశాలు చేసుకుని నివాసం ఉంటున్నారని, రూఫ్ లెవెల్ లో 9, ఎల్ఎల్ లో 4, బిఎల్ లో, బిబిఎల్ లో 15 గృహా నిర్మాణాలు ఉన్నట్లు గృహ నిర్మాణ శాఖ ఇన్చార్జి పిడి జి.పిచ్చియ్య జిల్లా కలెక్టరుకు తెలిపారు. లేఅవుట్ లో త్రాగునీటి మిగిలి ఉన్న పనులు పూర్తి చేయుటకు జల జీవన మిషన్ ద్వారా అయిదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని గ్రామ సర్పంచి బొల్ల శ్రీనివాసు జిల్లా కలెక్టరును కోరారు. జిల్లా కలెక్టరు స్పందిస్తూ లేఅవుట్ లో తక్షణం త్రాగునీరు అందించుటకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూయస్ అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో లేఔట్లలో మిగిలిఉన్న గృహాలు పూర్తి చేయుట, పూర్తయిన ఇండ్లలో లబ్ధిదారును గృహా ప్రవేశాలు చేయించుట, కాలనీ మౌలిక సదుపాయాల కల్పనలో గృహా నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వారానికి రెండు పర్యాయములు జిల్లాలో లే అవుట్ లను ఆకస్మిక తనిఖీలు చేపడతానన్నారు. పూర్తయిన గృహాలను, బిలో బేస్మెంటు, బేస్మెంటు గృహాలను డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తి చేసి లబ్ధిదారులను గృహాప్రవేశాలు చేయించాలన్నారు. వివిధ దశలో ఉన్న గృహాలను మార్చి 31 వ తేదీకి నాటికి పూర్తి చేసి నూటికినూరుశాతం లబ్ధిదారులతో గృహాప్రవేశాలు చేయించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గృహానిర్మాణ శాఖ ఇన్చార్జి పిడి జి.పిచ్చయ్య, మండల స్పెషల్ ఆఫీసర్ మరియు జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్.వి.యస్.వి.ప్రసాదు, తహాశీల్దారు యన్.భారతి విజయలక్ష్మి, యంపిడివో బి.రెడ్డియ్య, గృహానిర్మాణ శాఖ డిఇ పి.శివరామ రాజు, ఈవోపిఆర్డి యం.వి.యస్. రామ ప్రసాదు, ఏఇ లు బి.వి. నరసింహా రావు, యన్. పార్వతి, ఏపియం ఏ.భారతి, గ్రామ సర్పంచి బొల్ల శ్రీనివాసు, సచివాలయం, రెవిన్యూ, గృహానిర్మాణ శాఖ సిబ్బంది, విలేజీ ఆర్గనైజేషన్సు సహాయకులు, ఎక్కువ సంఖ్యలో కాలనీ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# అమరలింగేశ్వర స్వామిని దర్శించుకున్న వేగుళ్ళ

మండపేట:అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు బుధవారం అమరావతి లోని ప్రసిద్ధ శ్రీ అమరలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు ఎమ్మెల్యే కు ఆశీర్వచనం చేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పూజలునిర్వహించారు.మండపేట నియోజకవర్గం మరింత అభివృద్ధిలోకి రావాలని స్వామి వారి కటాక్షం వుండాలని పూజలు నిర్వహించారు.

# ఈనెల 22న మండల సర్వసభ్య సమావేశం

రాయల్ జర్నలిజం (కాకుమాను) ఈనెల 22వ తేదీన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో యుగ కీర్తి తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధి గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, మండల శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని. ఈ సమావేశానికి మండల శాఖ అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామాల్లోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరుగుతున్నట్లు తెలిపారు.

# ల్యాబ్ టెక్నీషియయన్స్‌కు రీ ఓరియంటేషన్ ట్రైనింగ్

- <u>వ్యాదులు నిర్దారణ లో ల్యాబ్ టెక్నీషియయన్స్ కీలకం</u>
- <u>జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి.. డాక్టర్ యన్. కొండయ్య</u>



రాయల్ జర్నలిజం రాయచోటి నవంబర్ 20:అన్నమయ్య జిల్లా లోని ల్యాబ్ టెక్నీషియన్స్ అందరికి ఈరోజు రాయచోటి యన్ జి వో హోమ్ లో ఒకరోజు రీ ఒరియంటేషన్ ట్రైనింగ్ జిల్లా మలేరియా అధికారి బి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎర్పాటు చేసారు ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యన్ కొండయ్య గారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ లో ల్యాబ్ టెక్నీషియయన్స్ పాత్ర చాలా ముఖ్యమని మలేరియా, డెంగీ, షుగర్, ఎచ్ బి ఇతర రక్త పరీక్షలు అన్ని ప్రజలకు రిజల్ట్ ఇస్తుండాలని, విధి నిర్వహణ లో శ్రద్ద గా పనిచేయాలన్నారు. కడప మలేరియా అధికారి మనోహరమ మాట్లాడుతూ రికార్డ్ అన్ని మెయింటైన్ చేయాలన్నారు. విజయవాడ నుండి ట్రైనింగ్ కోసం వచ్చిన అధికారి లక్ష్మి సుభద్ర గారు ట్రైనింగ్ లో మాట్లాడుతూ మలేరియా, డెంగీ, ఇతర రక్తపరీక్షలు చేసి కరెక్ట్ నిర్ధార్ణ చేయాలనీ, పరీక్షలు చేసే విధానం, రికార్డ్, ల్యాబ్ నిర్వహణ, పై ల్యాబ్ టెక్నీషియయన్స్ కు రీ ఒరియంటేషన్ ట్రైనింగ్ ఉదయం నుండి సాయంత్రం వరకు ఇచ్చారు.జిల్లా మలేరియా అధికారి బి. వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ ట్రైనింగ్ వల్ల అందరూ యల్ టి లకు మంచి అవగాహన వచ్చిందన్నారు. రేపటినుండి 3 బ్యాచ్ లుగా అర్బన్ హెల్త్ సెంటర్ లో ప్రాక్టికల్ వర్క్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమం లో మలేరియా సబ్ యూనిట్ అధికారులు వై. ప్రసాద్ యాదవ్, జయరామయ్య, జయచంద్ర, కలీల్, ముజీబ్, దాస్, శ్రేను, కృష్ణమ్మా, ల్యాబ్ టెక్నీసీయన్స్ పాల్గొన్నారు.

# విద్యార్థులు చిన్ననాటి నుండి ఇతరులతో పోటీపడి చదవాలి

రాయల్ జర్నలిజం,రాయచోటి, నవంబర్20:విద్యార్థులు చిన్ననాటి నుండి ఇతరులతో పోటీపడి చదివినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని సంబేపల్లి పిఎస్ సబ్ ఇన్స్పెక్టర్ భక్తవత్సలం అన్నారు. బుధవారం ఉదయం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలను నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువకులు, విద్యావంతులు, విద్యార్థులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండి అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చాలామంది విద్యార్థులు టీవీ తోపాటు సోషల్ మీడియా విష వలయంలో చిక్కుకొని విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారన్నారు. అలా కాకుండా వారు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి సాకారం కోసం క్రమశిక్షణతో నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం సంబేపల్లి బ్రాంచ్ గ్రంథాలయం రికార్డ్ అసిస్టెంట్ రెడ్డి శేఖర్ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం ఈ పోటీలలో ప్రతిభ చూపిన పావని, ఆఫ్రా, జ్యోత్న, మానస, యశ్రిత, శరన్, ఉజ్వల్ నాయక్, ప్రణీత్, మస్తాన్, వెంకట జస్వంత్ లకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడి తాటి నర్సింహారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు



శంకరయ్య, జీవశాస్త్ర ఉపాధ్యాయులు రెడ్డి శేఖర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్కిరెడ్డిపల్లి మండలాన్ని అన్ని విధాలకు అభివృద్ధి చేయడమే మంత్రి ప్రధాన ధ్యేయం

## <u>మండల యువ నాయకుడు యనమల మదన్ మోహన్</u>

లక్కిరెడ్డిపల్లి రాయల్ జర్నలిజం నవంబర్20( అన్నమయ్య జిల్లా): మండలం లోని ప్రధాన ప్రజా సమస్యలపై మంత్రి వర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు మరియు అయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి గారు విశేష కృషి చేస్తున్నారు అని మండల యువ నాయకుడు యనమల మదనమోహన్ తెలిపారు.ఇప్పటికే తాగునీటి సమస్యలతో బాధపడుతున్నటువంటి అనేక గ్రామాలలో ఉచిత తాగునీటి బోర్లు ఏర్పాటు చేశారన్నారు. అనేక గ్రామాల్లో సి.సి రోడ్లు ఏర్పరిచి ప్రతి పల్లెకు రోడ్డు కనెక్టివిటీ పెంచారు. మండల కేంద్రంలోని కస్తూరిబా, గురుకుల పాఠశాలకు ప్రహరీ గోడలు సైతం నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వం హయంలో గుంతలు పడిన రోడ్డులను సైతం మరమ్మతులు చేపిస్తున్నారు అన్నారు. స్కూల్ కి వెళ్లే పిల్లల కోసం ప్రత్యేకంగా స్కూల్ బస్సు ఏర్పాటుచేసి వారికి



సమయానికి బస్సులు నడుపుతున్నారన్నారు. వైద్యం,కరెంటు, త్రాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తున్నారు. అలాగే రాయచోటి కడప జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ ని టన్నెలగా నిర్మించేందుకు కృషి చేశారు. అలాగే మండలం సమస్యలు పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు అధికారులు అధికారులతో మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్నారు అని యనమల మదనమోహన్ తెలిపారు. ఇప్పటికే సభ్యత్వలు పరంగా 8 వేల సభ్యత్వాలు చేశామని రాయచోటి తాలూకాలో లక్కిరెడ్డిపల్లి మండలం మొదటి స్థానంలో ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట డాక్టర్ సెల్ కార్యదర్శి డాక్టర్ షఫినాయక్, హేమంత్, మల్లికార్జున,మసూద్, డీలర్ అన్వర్, ముక్తార్ అహ్మద్, హరికృష్ణ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలు



రాయల్ జర్నలిజం,బాపట్ల, నవంబర్ 20 : తుపాను హెచ్చరిక నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. తుపాను హెచ్చరిక నేపథ్యంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ బుధవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. మత్స్యకారులు వేట కొరకు సముద్రంలోకి వెళ్లరాదని జిల్లా కలెక్టర్ ప్రకటించారు. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోని ఏర్పడదంతో వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు వచ్చాయన్నారు. అల్పపీడనం తపానుగా మారే అవకాశం ఉందన్నారు. ఈనెల 27వ తేదీ వరకు సముద్రంలోకి మత్స్యకారులను వెళ్లనివ్వరాదని చెప్పారు. ఇప్పటికే వేటకు వెళ్లి ఉన్న మత్స్యకారులు వెంటనే బయటకు పిలిపించాలని ఆదేశించారు. ఒక్కరికి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తదనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. చేతికి అందివచ్చిన ధాన్యం పంటను 22 నుంచి 27వ తేదీ వరకు కోయరాదన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తు వర్షాలకు చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలినా, రహదారులు దెబ్బతిన్నా తక్షణమే పునరుద్ధరించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చెప్పారు. అవసరమైన సహాయక చర్యల కొరకు యంత్రాలను ముందు గానే సిద్ధం చేసుకోవాలన్నారు. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు ముని గితే తక్షణమే ఆ ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వారికి అవసరమైన నిత్యవసర సరుకులు ముందుగానే నిల్వ చేసుకోవాలన్నారు. రెవిన్యూ అధికారులు మండల కేంద్రా ల్లోనే విధిగా నివాసం ఉండాలన్నారు. ఎంపీడీవోలు మండలాలను విడిచి వెళ్లరాదన్నారు. సహాయక చర్యల కొరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులు, పెంపుడు జంతువులను సురక్షిత ప్రాంతాలలో ఉంచుకోవా లన్నారు. వాటికి అవసరమైన పశువుల దాణా ముందుగానే నిల్వ చేసుకోవా లన్నారు. ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ వీక్షణ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



# పారిశుద్ధ కార్మికులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తపరీక్షలు




రాయల్ జర్నలిజం ,బాపట్ల, నవం బర్ 20 :బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ నారాయణ భట్టు ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ కార్యాలయంలో బాపట్ల పురపాలక సంఘం పారిశుధ్య కార్మికులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం బ్లడ్ గ్రూప్స్ పరీక్ష లు నిర్వహించి 62 మందికి గుర్తింపు కార్డులు అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీ నివాస్ రావు శానిటరీ మేస్త్రిలు , పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

# దత్తత అవగాహన మాసోత్సవాలు



రాయల్ జర్నలిజం,బాపట్ల,నవంబర్ 20 : దత్తత అవగాహన మాసోత్సవాలు సందర్భంగా బాపట్ల జిల్లా మహిళ మరియు శిశు సంక్షేమ శాఖ, బాపట్ల కలెక్టర్ జె వెంకట మురళి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం నందు దత్తత అవగాహన మాసోత్సవం లో భాగంగా ఉయ్యాల పోస్టర్స్ ను ఆవిష్కరించడం జరిగింది. పిల్లలను చెత్తబుట్టలలో , జనసంచారం లేని ప్రాంతాలలో వదిలి వేయకుండా ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేయబడే ఉయ్యాల నందు ఉంచినట్లయితే అలాంటి పిల్లలను ప్రభుత్వం నిర్వహిం చుచున్న శిశు గృహ ఆశ్రయం కల్పించి చట్టభదంగా దత్తత జరుగుతుంది. ఈ నవం బర్ నెలను దత్తత మాసోత్సవాల నెలగా ప్రకటించడం జరిగినది అని చెప్పడం జరిగింది.

# పారిశుద్ధ కార్మికులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తపరీక్షలు



రాయల్ జర్నలిజం,బాపట్ల,నవంబర్ 20 :బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ నారాయణ భట్టు ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ కార్యాలయంలో బాపట్ల పురపాలక సంఘం పారిశుధ్య కార్మికులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం బ్లడ్ గ్రూప్స్ పరీక్ష లు నిర్వహించి 62 మందికి గుర్తింపు కార్డులు అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీ నివాస్ రావు శానిటరీ మేస్త్రిలు , పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

# విశేష అలంకారంలో గగనభూషణు నిగా దర్శనమిచ్చిన స్వామివారు



రాయల్ జర్నలిజం,బాపట్ల,నవంబర్ 20 :బాపట్ల ఎస్ ఎన్ పి అగ్రహారం లో వేంచేసియున్న శ్రీ గంగా పర్వత వర్ధనీ సమేత రామలి ంగేశ్వర స్వామి వారి కార్తీక మాసోత్సవాలలో భాగంగా బుధ వారం కార్తీకమాసం ప్రాతః కాల అభిషేకం అనంతరం స్వామి వారు విశేష అలంకారం "గగన భూషణు ని "గా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో గూడూరు చిట్టిబాబు, గూడూరు సాయి వెంకట్,నె మలికంటి హనుమంతరావు సహకారం తో ఆలయ ధర్మకర్తలు ఆదూరి హరినారాయణ,భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.అధిక సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్‌గా రామకృష్ణ



పర్చూరు,నవంబర్ 20:తెలుగుదేశం పార్టీ పర్చూరు నియోజకవర్గ సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ గా తిమ్మరాజుపాలెం గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గోరంట్ల రామకృష్ణ ను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నియమించారు. ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. రామకృష్ణ పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో సభ్యత్వ నమోదును వేగవంతం చేసేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులను సమన్వయం చేసేలా పని చేయనున్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు విధిగా సభ్యత్వం నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు. మండల నాయకులు ఆయా మండలాల్లో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచించారు.

# సమష్టి కృషితో జలవనరుల సంరక్షణ

***నీటి వనరుల నిల్వ సామర్థ్యం పెంచేందుకు చర్యలు చేపట్టాలి: ఆక్రమణలు తొలగించాలి***

***చెరువులు, కాలువలు ఆధునికీకరణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్***

***14 చెరువులు, 17 జలధారల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకొచ్చిన ధాన్ ఫౌండేషన్***



విశాఖపట్నం,: జిల్లాలోని చెరువులు, సాగునీటి కాలువలు, స్లూయిజ్లు, జల ధారలను సంరక్షించేందుకు ప్రత్యేక ప్రణాళిక, సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. నీటి వనరుల అదనపు నిల్వ సామర్థ్యాన్ని 23 వేల క్యూబిక్ మీటర్లకు పెంచేందుకు చర్యలు చేపట్టాలని, నీటి వనరులను సంరక్షించేందుకు ముందుకొచ్చిన దాన్ ఫౌండేషన్ కు సహకారం అందించాలని సూచించారు. ఆక్రమణలు తొలగిం చాలని, సరిహద్దులు గుర్తించాలని జీవీఎంసీ, రెవెన్యూ అధికారులను ఆదేశిం చారు. కలెక్టరేట్ మీటింగు హాలు లో బుధవారం సాయంత్రం జలవన రుల సంరక్షణ, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. సమీప రైతులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతిని ధులతో మాట్లాడాలని, చెరువుల ఆధునికీకరణ, తద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని యూసిడి పీడీ, డీఆర్డీయే పీడీలకు చెప్పారు. స్థానిక పరిస్థితులు, ఆక్రమణలు ఇతర అంశాలపై రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని సూచించారు. తదుపరి ఉమ్మడి కార్యాచరణకు అందరూ సంసిద్ధంగా ఉండాలని, ధాన్ ఫౌండేషన్ రూపొందించిన ప్రణాళికకు అనుగుణంగా పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని ప్రధాన నీటి వనరులైన మేఘాద్రి గెడ్డ, గోస్తని నది తాజా పరిస్థితిపై నివేదిక సమర్పించాలని ఆయా తహశీల్దార్లను ఆదేశించారు.

**రూ.కోటి అంచనాతో.. ప్రత్యేక ప్రణాళికను వెల్లడించిన ధాన్ ఫౌండేషన్:** జిల్లాలోని మొత్తం 14 చెరువులు, 17 జల ధారలు, 16 కి.మి. మేర సాగునీటి కాలువలు, 11 కొత్త స్లూయిజ్లు, మరో మూడు స్లూయిజ్లకు మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.కోటి అంచనాతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు ధాన్ ఫౌండేషన్ ప్రతినిధి లోకేష్ తెలిపారు. పర్యావరణ హితమైన విధానాలతో చెరువులను, కాలువలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. క్యాస్కేడింగ్ అనే పేరుతో మూడు పద్ధతుల్లో ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా రాంపురం, ఆటోనగర్, కొత్తపాలెం, కాపులుప్పాడ ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పనులు పూర్తి అయితే వెయ్యి మందికి ప్రత్యక్షంగా, ఐదు వేల మందికి పరోక్షంగా ప్రయోజనాలు ఒనగురుతాయని చెప్పారు. ఈ మేరకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు.సమావేశంలో వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాధుర్, ఏడీసీ రమణమూర్తి, జీవీఎంసీ సీఈ శివప్రసాద్ రాజు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత




రాయల్ జర్నలిజం,బాపట్ల,నవంబర్ 20 : బాపట్ల జిల్లా స్థాయిలో ఎస్.ఈ.ఆర్.పి - జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బాపట్ల మండల మహిళా సమాఖ్య నందు వాష్ కార్యక్రమం పై జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమము ఏరియా కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు మరియు కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు శిక్షణ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.పద్మ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడమే కాకుండా భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం మరియు భోజనం తర్వాత కూడా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం అలానే మరుగుదొడ్లు ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని మరి ముఖ్యంగా చిన్నపిల్లలు గర్భిణీ స్త్రీలు కచ్చితంగా చేతులను శుభ్రంగా ఉంచుకుంటూ అనారోగ్యం పాలు కాకుండా ఉండాలని తెలియజేశారు.ప్రస్తుత సీజన్ నందు కాచి చల్లార్చిన నీరు త్రాగటం వల్ల చిన్న పిల్లలు పెద్దవారు డయేరియా, నిమోనియా లాంటి వ్యాధులు సంక్రమించకుండా ఉండొచ్చని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సమతుల ఆహారాన్ని తీసుకోవాలని గర్భిణీ స్త్రీలు, బాలింతలు రెండు సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లల తల్లులు పోషకాహారాన్ని తీసుకోవాలని తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డి.పి.యం.యు నుండి హెల్త్ అండ్ న్యూట్రిషన్ యాంకర్ పర్సన్ డి. శ్రీనివాసులు, మాస్టర్ ట్రైనర్స్ మస్తాన్, శ్రీనివాసరెడ్డి, ఏరియా కోఆర్డినేటర్లు, ఏ.పి.యం లు మరియు సి.సి లు పాల్గొనడం జరిగింది.

# రికార్డ్ స్థాయిలో తపాలా శాఖలో ఐపిపిబి అకౌంట్స్



మండపేట నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ప్రభుత్వ పథకాలు తపాలా శాఖ ద్వారా పొందటానికి వీలుగా తపాలా శాఖ ఆధ్వర్యంలో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మంగళవారం ఒక్కరోజే మండపేట పోస్ట్ ఆఫీస్ సిబ్బంది 500ఎకౌంట్లో ఓపెన్ చేసి రికార్డు సృష్టించారు. ఈ అకౌంట్లో ద్వారా ప్రభుత్వ పథకాలన్నీ లబ్ధిదారుల ఇంటి వద్దకి తపాలా శాఖ అందించనుంది. మండపేట తపాల శాఖ సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి అధికారులు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు విసిదీకరించడంలో మండపేట తపాలా సిబ్బంది చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రామచం ద్రపురం పోస్టల్ సబ్ ఇన్స్పెక్టర్ పి.కామేశ్వరరావు, పోస్ట్ మాస్టర్ ఎం.వి సుబ్బారెడ్డి, పోస్టల్ అసిస్టెంట్లు కొండపల్లి సూర్యనారాయణ, కే.వి. నారాయణరావు (బాబి), ఎండి మౌలానా షరీఫ్, ఎస్ దుర్గాదేవి, ఎం

రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM

# అదానీ సంస్థ సిబ్బందిపై.. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయుల దాడి



అమరావతి: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం లోని కొండాపురం రాగికుంట గ్రామం వద్ద పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణ పనులు చేస్తున్న అదానీ సంస్థ సిబ్బం దిపై స్థానిక భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులు రాళ్ల దాడికి తెగబడ్డారు. కంపెనీ క్యాంపుపైనా దాడిచేసి అద్దాలు పగలకొట్టారు. అక్కడున్న వాహనాలు, యంత్రాలను ధ్వంసం చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారమి వ్వకుండా పనులెలా చేపడతారంటూ ఆదినారాయణరెడ్డి కుటుంబసభ్యులు శివనారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి మంగళవారం సాయంత్రం దౌర్జన్యానికి పాల్పడ్డారు. అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనపై ఆ సంస్థ ప్రతినిధులు మంగళవారం రాత్రి తాళ్ల ప్రొద్దుటూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయనున్నట్లు ఎస్టై రుషికేశ్వర్‌రెడ్డి తెలిపారు.రాగికుంట వద్ద 470 ఎకరాల విస్తీర్ణంలో వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్ నిర్మాణాన్ని అదానీ సంస్థ ప్రారంభించింది. క్యాంపు ఏర్పాటు చేసుకుని యంత్రాలతో నేల చదును పనులు చేపట్టింది. దీంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులైన శివనారాయ ణరెడ్డి, రాజేశ్‌రెడ్డిలు తమ అనుచరులను వెంటపెట్టుకుని వాహనాల్లో పని ప్రదేశానికి వచ్చి అదానీ సంస్థ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. కాసేపటికి రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత సంస్థ ప్రతినిధులతో చర్చించారు. డబ్బుల కోసమే ఈ దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రెండు రోజుల కిందటే చంద్రబాబు తీవ్ర ఆగ్రహం**

భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వ్యవహారం గురించి తెలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల తీవ్రంగా ఆగ్రహించినట్లు సమాచారం. ఎమ్మెల్యే అనుచరులు, కుటుంబీకులు నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమలను బెదిరిస్తున్నారని, డబ్బుల కోసం వేధిస్తున్నారని ఫిర్యాదులు అందటంతో రెండు రోజుల కిందటే ఆయన్ను సీఎంవోకు పిలిపించారు. 'వైకాపా పాలన వల్ల దెబ్బతిన్న రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చి, అభివృద్ధి చేసేందుకు, ఉపాధి కల్పించేందుకు ఓ వైపు తాను ప్రయత్నిస్తుంటే.. పారిశ్రామికవేత్తలను బెదిరించడం, డబ్బులు అడగడమేంట'ని మందలించినట్లు సమాచారం. ఈ నియోజకవర్గ పరిధిలో సిమెంట్ కర్మాగారాలు, జిందాల్ సంస్థకు చెందిన పరిశ్రమలున్నాయి. ఎమ్మెల్యే అనుచరులు వారిని డబ్బుల కోసం బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. అదానీ విద్యుత్తు ప్రాజెక్టుకు సంబంధించి ఒక్కో మెగావాట్‌కు ఇంత చొప్పున రూ.కోట్లల్లో డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై అదానీ సంస్థ ప్రతినిధులు భాజపా, కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దిల్లీ పెద్దలు తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం.

**ఉద్యోగాలు అడిగేందుకే వెళ్లారు: ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్యే**

మా ప్రాంతంలో పరిశ్రమ పెడుతున్నారని తెలిసి, స్థానికు లకు ఉద్యోగాలివ్వాలని, తమ వాహనాలను అద్దెకు పెట్టుకోవా లని అడగడానికి మాత్రమే మావాళ్లు అక్కడికి వెళ్లారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఒక చుట్టూ చుట్టొచ్చారంతే. అదే సమయంలో అక్కడ వైకాపా నాయకులు కనిపించడంతో మా వాళ్లకు కోపం వచ్చింది. అంతకుమించి అక్కడేమీ జరగలేదు.

# శ్రీవారి భక్తులకు అలర్ట్.. తిరుమలలో ఆ దర్శనాలు రద్దు..



అమరావతి :తిరుమల వెళ్లే భక్తులకు ముఖ్య గమనిక.. తిరుమల ఆలయంలో టూరిజం కార్పొరేషన్లకు కేటాయిస్తున్న శ్రీవారి దర్శన టికెట్లను రద్దు చేస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవిదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళుతుంటారు.ఆలయంలో భక్తుల కోసం వీఐపీ దర్శనం, స్పెషల్ ఎంట్రీ, సర్వదర్శనం తదితర విధానాల్లో ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పిస్తున్నారు. అయితే, ఈ దర్శనాలతో పాటు ఆలయంలో వివిధ రాష్ట్రాల టూరిజం కార్పొరేషన్లకు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను కేటాయిస్తూ వచ్చేవారు. కానీ, ఈ దర్శనాలను ఇప్పుడు రద్దు చేస్తున్నట్లు టీటీడీ నూతన పాలకమండలి ప్రకటించింది. టూరిజం కార్పొరేషన్లకు కేటాయిస్తున్న శ్రీవారి దర్శన టికెట్లతో ఏపీ టూరిజం, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ, ఐఆర్‌టీసీల ద్వారా చాలామంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకునేవారు. ఈ టికెట్ల వల్ల సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు తక్కువ సమయంలోనే స్వామివారి దర్శనం చేసుకొని తిరిగి వెళ్లేవారు. కానీ, ఇప్పుడు టీటీడీ నూతన పాలక మండలి ఈ దర్శన టికెట్లను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది.

**రోజుకు 4వేల టిక్కెట్లు...**

టీటీడీ ఇతర రాష్ట్రాల టూరిజం కార్పొరేషన్లకు రోజుకు నాలుగువేల టికెట్లు కేటాయిస్తుండేది. అందులో ఏపీ టూరిజానికి 1,000 టిక్కెట్లు కాగా, తెలంగాణకు 800 టికెట్లు, మిగతా వాటికి 500, 400 చొప్పున టికెట్లను కేటాయించేది. ఈ టిక్కెట్ల కోసం ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల స్లాట్ ద్వారా దర్శనం కల్పించేది. అయితే టూరిజం కార్పొరేషన్ల టికెట్ల అవకతవకలపై ఫిర్యాదులు రావడంతో ఏడు టూరిజం కార్పొరేషన్లకు దర్శన టికెట్లను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ తీసుకున్న ఈ నిర్ణయంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సమస్యలు తప్పవని చాలామంది భావిస్తున్నారు.

# కొత్త పెన్షనర్లకు గుడ్ న్యూస్.. దరఖాస్తులకు ముహూర్తం ఫిక్స్..అర్హతలు, డాక్యుమెంట్లు ఇవే..!






అమరావతి: కొత్త పెన్షనర్ల విషయంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎంతో కాలంగా కొత్త పెన్షన్ల కోసం వేచి చూస్తున్న వారికి గుడ్ న్యూస్ చెప్పింది. అతి త్వరలోనే కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.ఇందు కోసం ఇప్పటికే ముహూర్తం కూడా ఖరారు చేసింది. కొత్త పెన్షన్ల మంజూరు చేయటంతో పాటుగా అర్హత లేకుండా పెన్షన్ తీసుకుంటున్న వారికి కోత వేసేం దుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రభుత్వం అధికా రులకు ఇచ్చిన ఆదేశాలతో ఇప్పటికే కసరత్తు ప్రారంభమైపోయింది.

**కొత్త పెన్షన్ల కోసం..**

ఏపీలో కొత్త పెన్షన్ల జారీకి రంగం సిద్ధం అవుతోంది. వచ్చే నెల నుంచి కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులను స్వీకరిం చడంతో పాటుగా జారీ దిశగా ప్రభుత్వం మార్గదర్శకాలు ఖరారు చేస్తోంది. తాజాగా ఏపీ ప్రభు త్వం అసెంబ్లీ వేదికగా కొత్త పెన్షన్ల జారీ పైన ప్రకటన చేసింది. వచ్చే నెల నుంచి ఇందు కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. ఆన్ లైన్ విధానంతో పాటుగా వార్డు, గ్రామ సచివాలయాల ద్వారా దరఖా స్తులు స్వీకరించాలని నిర్ణయం తీసుకు ంది. ఇం దుకు సంబంధించి వారి ఎంపిక సైతం గ్రామ సభల ద్వారానే నిర్వహి ంచాలని సూత్ర ప్రాయ ంగా నిర్ణయి ంచింది. కొత్త దరఖాస్తు దారులకు అర్హత లతో పాటు గా సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై స్పష్టత వచ్చింది.

**దరఖాస్తుల స్వీకరణ**

దాదాపు రెండు లక్షలకు పైగా కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చాలా కాలంగా రకరకాల కారణాలతో కొత్త పెన్షన్లు ఆగిపోయాయని అదే విధంగా గత ప్రభుత్వంలో పలువురు అనర్హులకు పెన్షన్లు మంజూరు చేసినట్లు అధికారులు గుర్తించారు. సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ల పంపిణీ సమయంలో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. దీంతో, కొత్తగా పెన్షన్ల మంజూరు సమయంలో పక్కాగా వ్యవహరించాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందేలాగా అనర్హులైన వారిని తీసేసే లాగా నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి డిసెంబర్లో దరఖాస్తుల స్వీకరణ.. విచారణ.. ఖరారు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తుంది. జన్మభూమి -2 జనవరిలో ప్రారంభించాలని ఇప్పటికే నిర్ణయించిన ప్రభుత్వం ఆ సమయంలోనే కొత్త పెన్షన్లను విడుదల చేయాలనే ఆలోచనలో ఉంది. వృద్ధాప్య, వితంతు పింఛన్‌తో పాటుగా అన్ని రకాల పెన్షన్లలో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

**కావాల్సిన డాక్యుమెంట్లు**

దరఖాస్తు దారులు తమ అప్లికేషన్లతో పాటుగా సమర్పించా ల్సిన డాక్యుమెంట్ల పైన అధికారులు స్పష్టత ఇచ్చారు. ఆధార్, రేషన్ కార్డుతో పాటుగా బ్యాంకు ఖాతా వివరాలు తప్పని సరిగా జత చేయాల్సి ఉంటుంది. బ్యాంకు ఖాతాతో అనుసంధానం అయి ఉన్న వ్యక్తిగత ఫోన్ నెంబర్‌ను ఇవ్వాలని సూచించారు. వితంతు పెన్షన్లకు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో పాటుగా భర్త డెత్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. వీటిని స్థానిక సచివాలయ సిబ్బంది పరిశీలించి వారి అర్హతను ఖరారు చేస్తారు. వీరికి జనవరి నుంచి కొత్త పెన్షన్లు పంపిణీ చేసేలా ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. అర్హత లేని వారిని తొలిగింపు అంశంలోనూ ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేయనుంది.

# పసిడి తనఖా రుణాలకూ ఈఎమ్ఐ



ముంబయి: పసిడి తనఖాపై రుణాలిచ్చే బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు.. వినియోగదారులు తిరిగి చెల్లించేందుకు నెల వారీ వాయిదా పథకాలను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నాయి. బంగారం తనఖా రుణాల పంపిణీలో లోటుపాట్ల గురించి ఆర్‌బీఐ హెచ్చరించడం ఇందుకు నేపథ్యమని ఎకనామిక్ టైమ్స్ పేర్కొంది.ఇప్పటి దాకా ఇలా: ప్రస్తుతం బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రుణం తీసుకున్న వారు, కాలావధి పూర్తయ్యాక.. వడ్డీతో కలిపి మొత్తం బకాయి చెల్లిస్తున్నారు. నెలవారీ కిస్తీ (ఈఎమ్ఐ) పద్ధతి వీరికి లేదు. అయితే తమ దగ్గర డబ్బులు ఉన్నపుడల్లా, పాక్షిక చెల్లింపులు చేసే వీలు మాత్రమే వినియోగదారులకు ఉంది. కావాలనుకుంటే, రుణ కాలావధికి ముందే, మొత్తం బకాయినీ చెల్లించొచ్చు.రాబోయే మార్పు ఇలా: రుణం మంజూరయ్యాక వడ్డీ, అసలును నెలవారీ సమాన వాయిదాల (ఈఎమ్ఐలు) రూపంలో చెల్లించాలని నియంత్రిత సంస్థలు వినియోగదార్లను కోరే అవకాశం ఉంది. పసిడి రుణ కంపెనీలు కూడా, రుణాలు ఇవ్వడానికి టర్మ్ రుణాలను తీసుకోవచ్చు.ఆర్‌బీఐ ఏం గుర్తించిందంటే: పసిడి ఆభరణాల తనఖాపై ఇచ్చే రుణాల్లో అవకతవకలు జరుగుతున్నాయని గుర్తించినట్లు సెప్టెంబరు 30 నాటి సర్క్యులర్‌లో ఆర్‌బీఐ వెల్లడించింది. బంగారం విలువ లెక్కగట్టడం - బకాయిలున్న వారి ఆభరణాల వేలంలో పారదర్శకత లోపిస్తోందని, రుణం-విలువ నిష్పత్తి పరిశీలన, నష్టభయం గణన వంటి అంశాలను ఆర్‌బీఐ ప్రస్తావించింది. వీటన్నిటికీ మించి కేవలం పాక్షిక చెల్లింపునే ఆమోదించడమనేది లోపభూయిష్ఠ ధోరణిగా పేర్కొంది. రుణం ఇచ్చేందుకు బంగారం విలువనే ప్రాతిపదికగా తీసుకోకుండా, రుణస్వీకర్త చెల్లింపు సామర్థ్యాన్నీ పరిగణనలోకి తీసుకోవాలని నిర్దేశించింది. పాక్షిక చెల్లింపులు చేస్తే, రుణాన్ని రోలోవర్ చేయడమూ మంచిది కాదని తెలిపింది. అందుకే పసిడి తనఖా రుణాలకూ, నెలవారీ చెల్లింపు పద్ధతిని పరిశీలిస్తున్నట్లు వివరించింది.టాపప్‌లు పైకి: పసిడి ధరలు పెరగడంతో, ప్రస్తుత రుణాలపై టాపప్ (అదనపు మొత్తం) తీసుకోవడం పెరుగుతోంది .రూ.1.4 లక్షల కోట్లు: సెప్టెంబరు 30 నాటికి బ్యాంకులు మంజూరు చేసిన పసిడి తనఖా రుణాల విలువ ఇది. ఏడాది కిందటితో పోలిస్తే ఇందులో 51% వృద్ధి ఉంది. హామీలేని సూక్ష్మ రుణాలతో పోలిస్తే పసిడి తనఖాపై రుణాలు వేగంగా లభించడం వల్ల వినియోగదార్లు వీటికి మొగ్గుచూపుతున్నారు.

# ఇది కదా పవన్ అంటే.. తప్పుచేస్తే ఫ్యాన్స్ అయినా, జనసైనికులు అయినా చర్యలు తీసుకుంటామని పోస్ట్..



అమరావతి : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఏపీ పాలనలో బిజీగా ఉన్నారు. తన చేతిలో ఉన్న శాఖలను పరుగులు పెట్టిస్తూ మిగతా శాఖలను కూడా గమనిస్తున్నారు. కొత్త కొత్త పనులకు శ్రీకారం చుడుతూ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కూడా మొదలుపెట్టారు. ఇటీవల సోషల్ మీడియాని ఉపయోగించుకొని తప్పుడు పోస్టులు, కుటుం బాలను, మహిళలను కించపరుతూ పోస్టులు చేసే వారిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని పవన్ ఓ బహిరంగ సభలో అన్నారు. సోషల్ మీడియా అబ్యూజ్ ప్రొటక్షన్ బిల్ కూడా త్వరలోనే తెస్తామని అన్నారు.ఈ క్రమంలో పవన్ జనసేన పార్టీ తమ పార్టీ కార్యకర్తలకు, పవన్ ఫ్యాన్స్ కు సూచనలు ఇస్తూనే హెచ్చరికలు జారీ చేసింది. జనసేన పార్టీ సోషల్ మీడియా వింగ్ అయిన జనసేన శతాఘ్ని పవన్ సూచనలతో, పార్టీ ఆదేశాలతో సోషల్ మీడియా గురించి ఓ పోస్ట్ చేసింది. ఇందులో.. సోషల్ మీడియాని బాధ్యతగా, సమాజానికి ఉపయోగకరంగా వినియోగించాలి. పార్టీ విధానాలను, ప్రభుత్వ కార్యక్రమాలను, అధినేత పవన్ కళ్యాణ్ గారి భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేలా పనిచేయాలి. సోషల్ మీడియాలో కొంతమంది వ్యక్తులు, నాయకులు రెచ్చగొట్టేలా వ్యవహరించి నప్పటికీ సంయమనంతో వ్యవహరించండి. పార్టీ అధికారిక సోషల్ మీడియా విభాగం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ పార్టీ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుంది. వీటిపై సమయాను కూలంగా పార్టీ, పార్టీ నాయకులు స్పందిస్తారు అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఇతర రాజకీయ నాయకులపై కానీ, సినీ నటులపై కానీ, ఏ ఇతర అంశాలపై కానీ తప్పుడు వార్తలు, అసభ్యకర పదజాలం, మార్ఫింగ్ ఫోటోలు పోస్ట్ చేయడం లేదా షేర్ చేయడం, మహిళలు, పిల్లలపై తప్పుడు పోస్టులు పెట్టడం లేదా అలాంటి వారిని ప్రోత్సహించడం చట్టబద్ధమైన నేరం. పార్టీ ముసుగులో లేదా అభిమాని ముసుగులో ఎవరైనా ఇలా చేస్తే వారిపై పార్టీ కఠినంగా వ్యవహరిస్తుంది. చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రభుత్వ పాలసీలు, ప్రజా సమస్యలు చర్చించేందుకు, సద్విమర్శలు, సూచనలకు సోషల్ మీడియా వేదిక కావాల్సిన అవసరం ఉంది. మీకు ఏవైనా సలహాలు, సూచనలు ఉంటే మీ నియోజకవర్గ పార్టీ కార్యాలయం దృష్టికి కానీ, నాయకుల దృష్టికి కానీ తీసుకురండి. ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారు సూచించిన విధంగా సోషల్ మీడియా అబ్యూజ్ ప్రొటెక్షన్ బిల్ కూడా త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకురానున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ ఇతరులకు ఆదర్శంగా నిలబడాలని, జనసైనికులు క్రమశిక్షణతో మెలగాలని విజ్ఞప్తి చేస్తున్నాము అంటూ పోస్ట్ చేసారు.దీంతో సొంత పార్టీ నాయకులను, కార్యకర్తలను, అభిమానులను ఇలా చెప్పే ధైర్యం ఎవరికీ ఉంటుంది, తప్పు చేస్తే ఫ్యాన్స్ అయినా కఠిన చర్యలు తీసుకుంటామని ఏ హీరో చెప్తాడు, ఇది కదా పవన్ కళ్యాణ్ అంటే, అందరిని సమానంగా చూస్తూ మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాడు అంటూ అభినందనలు కురిపిస్తున్నారు.

# ఈవీ షోరూంలో భారీ అగ్ని ప్రమాదం.. 45 స్కూటర్లతో పాటు సేల్స్ గర్ల్ సజీవ దహనం

అమరావతి :కర్ణాటక రాజధాని బెంగళూరులోని ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ షోరూంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాజ్‌కుమార్ రోడ్డులోని ఈవీ స్కూటర్ షోరూమ్‌లో మంటలు చెలరేగాయి.షోరూంలో పార్క్ చేసిన వాహనాలన్నీ దగ్ధమైనట్లు సమాచారం. అగ్నిప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే, అగ్నిమాపక దళం యొక్క అనేక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. అయితే మంటలు ఆర్పే సమయానికి నష్టం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ కూడా మృతి చెందింది.మంగళవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో షోరూంలో ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలను కాపాడుకోవడానికి అందరూ పరుగెత్తడం ప్రారంభించారు. షోరూమ్ నుంచి ఎలాగోలా బయటకు వచ్చి ప్రాణాలను కాపాడుకున్నారు. అయితే షోరూమ్‌లో పనిచేస్తున్న ఒక సేల్స్ గర్ల్ లోపల



చిక్కుకుంది. ఈ ఘటనపై ప్రజలు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పడం ప్రారంభించారు. చాలా గంటలపాటు శ్రమించి అగ్నిమాపక శాఖ మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికి అంతా కాలి బూడిదైంది. లోపల ఇరుక్కుపోయిన సేల్స్ గర్ల్ ప్రియ (20) కూడా సజీవ దహనమై దుర్మరణం చెందింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని చెబుతున్నారు. ఈ మొత్తం ప్రమాదంలో షోరూం యజమానికి లక్షల రూపాయల నష్టం వాటిల్లింది.

## పొద్దున తాళి కట్టి మధ్యాహ్నం చంపేశాడు.. బాలిక హత్య కేసులో విస్మయకర విషయాలు



మియాపూర్ : హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన బాలిక హత్య కేసుకు సంబంధించి పోలీసుల విచారణలో పలు విస్మయకర అంశాలు వెలుగు చూస్తున్నాయి.ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను ప్రేమ పేరుతో వంచించి పెళ్లి నాటకంతో ఆమెను హత్య చేయడం.. ఆ తర్వాతి పరిణామాలు పోలీసులను సైతం విస్మయానికి గురి చేస్తున్నాయి. గతంలో పలు చిన్నచిన్న దొంగతనాల కేసుల్లో జైలుకెళ్లిన చింటూ హత్య అనంతరం పోలీసులు, బాలిక కుటుంబసభ్యులను తప్పు దారి పట్టించేందుకు పలు యత్నాలు చేసినట్లు విచారణలో వెల్లడైంది.

**అందరికీ ఫొటోలు పంపి..**

ఈనెల 8న ఉదయం పెళ్లి చేసుకుంటానని నమ్మించిన చింటూ పుస్తెలతాడు, పూలదండలు కొన్నాడు. స్నేహితుడి ఇంట్లో అదేరోజు తాళి కట్టి దండలు మార్చుకుని పెళ్లయిపోయినట్లు అందర్నీ నమ్మించేందుకు ఫొటోలు దిగాడు. ఇన్‌స్టాగ్రామ్‌తోపాటు స్నేహితులకు, బాలిక కుటుంబ సభ్యులకు, ఆమె స్నేహితురాలికి వాటిని షేర్ చేశాడు. పెళ్లి చేసుకున్నారని అందరూ భావిస్తారనుకున్న చింటూ ఆమె హత్యకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. తన స్నేహితుడు, అతని భార్య బయటకు వెళ్లిన సమయంలో గంటల వ్యవధిలోనే బాలికను హత్య చేశాడు. తన స్నేహితుడిని, అతని భార్యను ఒప్పించి శవాన్ని మాయం చేయాలని భావించాడు.

**బట్టబయలైన దుర్మార్గం..**

8న మధ్యాహ్నం నుంచి బాలిక కుటుంబ సభ్యులకు ఫోన్ టచ్‌లో ఉన్న చింటూ మీ కుమార్తె కనిపించడం లేదంటూ నటించడం మొదలుపెట్టాడు. ఆమె ఆచూకీ కోసం విచారిస్తున్నానని బాలిక స్నేహితురాళ్లకు సమాచారం అందించాడు. ఈ క్రమంలోనే పోలీసులు విచారణ వేగవంతం చేయడంతో తప్పించుకునే యత్నాలు ప్రారంభించాడు. అతని ప్రవర్తనపై అనుమానంతో సాంకేతిక ఆధారాల సాయంతో పోలీసులు వలపన్ని చింటూను అదుపులోకి తీసుకోవడంతో ఈ హత్యోదంతం వెలుగు చూసింది. హత్య అనంతరం పలుమార్లు వాట్సాప్ కాల్ వినియోగించడంతో పోలీసులకు అతనిపై అనుమానం కలిగేలా చేసింది. ఎట్టకేలకు నిందితుడిని అరెస్ట్ చేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లోని డ్వాక్రా మహిళలకు డ్రోన్ పైలట్ శిక్షణ- కేవలం రూ.2 లక్షలకే డ్రోన్లు అందజేత

